
## క్లుప్తంగా

### దక్షిణ బరిలో 16 మంది

- ముగ్గురు ఉపసంహరణ
- బరిలో నిలిచిన వారికి గుర్తుల కేటాయింపు

డాబాగార్డెన్స్ : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విశాఖ దక్షిణ నియోజకవర్గానికి దాఖలైన మొత్తం 20 నామినేషన్లలో 19 నామినేషన్లను ఆమోదిస్తూ, అర్హత లేని ఒక నామినేషన్‌ను ఈ నెల 26న ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీతారామ్మూర్తి తిరస్కరించిన విషయం విదితమే. ఇదిలా ఉండగా నామినేషన్ల ఉపసంహరణ సోమవారం నిర్వహించారు. బరిలో ఉన్న 19 మందిలో ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. వీరిలో స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన చెన్నుబోయిన పద్మజ, బి. రోహిత్‌కుమార్ జైన్, స్వామిబాబు మొయ్యి సోమవారం నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. బరిలో వైఎస్సార్‌సీపీ నుంచి వాసుపల్లి గణేష్‌కుమార్‌కు ఫ్యాన్, జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌తో పాటు బహుజన సమాజ్ పార్టీ నుంచి కదిరి రాము, సమాజ్‌వాదీ పార్టీ నుంచి సూరాడ ఎల్లాజీ (హిజ్రా), పలువురు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు.

### ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం


దివ్యాలంకరణలో సాయినాథుడు

డాబాగార్డెన్స్ : పాతనగరంలోని బైరాగి మఠంలో వెలసిన షిర్డీ సాయినాథుని ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు సాంప్రదాయ రీతిన సాయినాథునికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. నూతన వస్త్రాలు, పుష్పమాలతో సాయినాథుని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీగీతా ప్రచార సమితిచే సామూహిక సంపూర్ణ గీతా పారాయణ నిర్వహించి ప్రత్యేక హారతులిచ్చారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఆలయ అధ్యక్షుడు జి. నూకేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్ కృష్ణమూర్తి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సీహెచ్‌వీ సత్యనారాయణ ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

### నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

### ముగిసిన సంస్కృత శిక్షణ తరగతులు


శిక్షణ ముగించుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 15 నుంచి 26 వరకు సంస్కృత శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ విజయవంతంగా ముగిసిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహు భాషల్లో ప్రావీణ్యం విద్యార్థులకు ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమ కో ఆర్డినేటర్ వై. లక్ష్మి, శిక్షకుడు శుభ్రజిత్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డి. అరుణపద్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# జగనన్నతోనే సంక్షేమం.. అభివృద్ధి

- పరిపాలనా రాజధానిగా విశాఖ
- నీలమాంబ అమ్మవారి ఆశీస్సులతో జగనన్న మళ్లీ సీఎం కావాలి
- బొత్స ఝాన్సీలక్ష్మి, వాసుపల్లి గణేష్‌కుమార్
- 36వ వార్డులో ఉత్సాహంగా ప్రచారం


వాసుపల్లికి అల్లా రక్ష కడుతున్న ముస్లింలు



ప్రచారంలో పాల్గొన్న బొత్స ఝాన్సీ, వాసుపల్లి గణేష్‌కుమార్, మేయర్ హరి వెంకటకుమారి తదితరులు


అంజుమన్ మసీదు వద్ద ముస్లిం మహిళలతో వాసుపల్లి, మేరీజోన్స్


పూర్ణామార్కెట్ రోడ్డులో ఉవ్వెత్తున సాగిన ప్రచారం

డాబాగార్డెన్స్ : జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని, నీలమాంబ అమ్మవారి ఆశీస్సులతో ఆయన విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తారని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. 36వ వార్డులో కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, వార్డు నాయకుడు మాసిపోగు రాజు ఆధ్వర్యంలో పూర్ణామార్కెట్ నుంచి ప్రచారం ప్రారంభించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులతో పాటు ముఖ్య నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఏవీఎస్ కాలేజీ వద్ద భారీ గజమాలతో నాయకులకు స్వాగతం పలికారు. ఏవీఎస్ కాలేజీ రోడ్డు, చిన్న రెల్లివీధి, రెల్లి వీధి వరకు భారీగా కదిలి వచ్చిన జనసంద్రంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసింది. ప్రచారం పొడవునా యువత కేరింతలు కొడుతూ జై జగన్..జైజై జగన్, జై వాసుపల్లి, జైజై బొత్స ఝాన్సీ అంటూ నినదించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రచారం అట్టహాసంగా సాగింది. అంబేడ్కర్ వేషధారణ ప్రత్యేకంగా నిలిచింది. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ మాట్లాడుతూ జగనన్న రావాలి.. మా కుటుంబాలు మళ్లీ సంతోషంగా సాగాలి అంటూ ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారన్నారు. జగనన్న వస్తే ఐటీ అభివృద్ధి, పరిపాలనా రాజధానిగా విశాఖను తీర్చిదిద్దుతారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పవిత్ర గ్రంథంలా భావించే మేనిఫెస్టో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపిందన్నారు. దక్షిణంలోనే కాక ఏడు నియోజకవర్గాల్లో బొత్స ఝాన్సీ గెలుపుతో పాటు విశాఖ వైఎస్సార్‌సీపీ కైవసం కాబోతుందన్నారు.

ఈ సందర్భంగా ముస్లింలు అంజుమాన్ మసీదులో వాసుపల్లికి అల్లా రక్ష కట్టి ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గంపల గిరిధర్, రామానంద్, డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, రెల్లి కార్పొరేషన్ చైర్మన్ వడ్డాది మధుసూదనరావు, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి ఖాజావల్లీ, వార్డు నాయకులు కంటిముచ్చు సాగర్ పాల్గొన్నారు.


ముస్లిం వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

### పేదలకు మేలు చేయని నాయకుల మాటలు నమ్మొద్దు

జగనన్న వస్తేనే బడుగు, బలహీన వర్గాలు సుఖంగా బతుకుతాయని ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 36వ వార్డు ప్రచారంలో ప్రజలను కలుసుకుని ఓటు అభ్యర్థించారు. పాలనా రీతిని మార్చిన జగనన్న ప్రజల ముంగిటకే ప్రభుత్వాన్ని రప్పించారన్నారు. పేదల కోసం ఏం చేయడానికైనా వెనుకాడని జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే మరింత మేలు జరుగుతుందన్నారు. పేదలకు ఇసుమంత మేలు చేయని నాయకుల మాటలను నమ్మొద్దని హితవు పలికారు.


ఏవీఎన్ కాలేజీ వద్ద ఝాన్సీ, వాసుపల్లికి భారీ గజమాలతో స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

### కాలుష్యరహిత విశాఖే లక్ష్యం


సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్ : వారంలో ఒకరోజు ప్రజా రవాణాను ఉపయోగించి నగరంలో కాలుష్యాన్ని అరికట్టేందుకు, కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. తన బంగ్లా నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒకరోజు ప్రజా రవాణాను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు దానిని అనుసరిస్తున్నారన్నారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో-జీరో పొల్యూషన్‌లో భాగంగా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

### న్యాయవాద పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇమంది


శ్రీనివాసరావు

అల్లిపురం : న్యాయవాద పరిషత్ రాష్ట్ర అధ్యక్షులుగా ఇమంది శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా సుబ్రహ్మణ్యంను ఎన్నుకున్నట్లు న్యాయవాద పరిషత్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి అశ్విన్‌కుమార్ తెలిపారు. గత ఆదివారం ద్వారకానగర్, పౌరగ్రంథాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యక్షుడు రామరాజు తదితరులు వారికి అభినందనలు తెలిపారు.

### ట్రాఫిక్ పోలీసులకు చలువ కళ్లద్దాలు, వాటర్ బాటిళ్ల పంపిణీ


సీపీకి ట్రామా కిట్లు అందజేస్తున్న యంగ్ ఇండియన్స్ ఎన్‌జీవో ప్రతినిధులు


ట్రాఫిక్ సిబ్బందికి థర్మల్ వాటర్ బాటిళ్లు, మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న సీపీ రవిశంకర్, జేసీపీ ఫకీరప్ప


చెక్‌పోస్టు సిబ్బందికి కిట్లు అందజేస్తున్న జేసీపీ ఫకీరప్ప

అల్లిపురం : మండుటెండలో విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసులకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సోమవారం థర్మల్ వాటర్ బాటిళ్లు, నాప్‌కిన్లు, చలువ కళ్లద్దాలు, తెలుపు టోపీలు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. అదే విధంగా యంగ్ ఇండియన్స్ ఎన్‌జీవో సంస్థ సహకారంతో హార్మొనీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అందజేసిన 66 ఎమర్జెన్సీ ట్రామా కిట్లను ట్రాఫిక్ పోలీసులు, ఎలక్షన్ విధుల్లో ఉన్న చెక్‌పోస్టు సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రూ.2.65 లక్షల సీపీ వెల్ఫేర్ ఫండ్ వెచ్చించి 400 థర్మల్ వాటర్ బాటిళ్లు, నాప్‌కిన్‌లు, చలువ కళ్లద్దాలు, టోపీలు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశామన్నారు. మండుటెండల్లో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు.

**66 ట్రామా కిట్ల అందజేత..**

అత్యవసర సమయాల్లో ప్రజల ప్రాణాలు కాపాడడంలో పోలీసులను మరింత భాగస్వామ్యం చేస్తూ ప్రథమ చికిత్సకు అవసరమయ్యే రూ. 2 లక్షలు విలువ చేసే ఎమర్జెన్సీ ట్రామా కిట్లను యంగ్ ఇండియన్స్ ఎన్‌జీవో సంస్థ అందజేసింది. ఈ కిట్లలో 6 పోర్టబుల్ స్ట్రెచర్లు, ఏఎంబీయూ బ్యాగ్ (ఎయిర్ మిక్సర్ బ్లోయింగ్ మిషన్)లను అందజేశారు. మంగళవారం నుంచి కేజీహెచ్‌లో కిట్ల వినియోగంపై డాక్టర్ ప్రత్యూష ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, ట్రాఫిక్ ఏడీసీపీ, ఏసీపీ-1, ఏసీపీ-2, హార్మొనీ ఫుడ్స్ డైరెక్టర్ విరాట్ మహేశ్వరి, యంగ్ ఇండియన్స్ చైర్ పర్సన్ రాయ్ కొడాలి, హర్షవర్ధన్, హర్షనందన్, రాణా ఉప్పలపాటి, డాక్టర్ ప్రత్యూష పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు


పార్టీలో చేరిన 37వ వార్డు జనసేన యువతతో వాసుపల్లి, గంపల గిరిధర్


పార్టీలో చేరిన జనసేన, ముస్లిం నాయకులతో వాసుపల్లి గణేష్‌కుమార్


డిస్ట్రిక్ట్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ సభ్యులతో వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: వైఎస్సార్‌సీపీలోకి ఇతర పార్టీల నుంచి చేరికలు జోరుగా సాగుతున్నాయి. దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ సమక్షంలో సోమవారం వివిధ వార్డుల నుంచి పలువురు నాయకులు, ప్రజలు పార్టీలో చేరారు.

**37వ వార్డులో జనసేన ఖాళీ..**

37వ వార్డులో జనసేన దాదాపుగా ఖాళీ అయిందని ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. వార్డులోని జనసేన యువత భారీగా పార్టీలో చేరారు. వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ సమక్షంలో గంపల గిరిధర్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది పార్టీలో చేరారు.

**38వ వార్డు నుంచి జనసేన, మైనార్టీల చేరిక..**

వార్డు నాయకుడు సన్యాసిరావు, బెహరా వెంకటరత్నం ఆధ్వర్యంలో వైజాగ్ పటం క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో వార్డుకు చెందిన జనసేన, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు సుమారు 200 మంది పార్టీలో చేరారు.

**33వ వార్డు నుంచి..**

వార్డు నాయకుడు ముత్తాబత్తుల రమేష్, మంగం పార్వతి ఆధ్వర్యంలో బంగారుమెట్ట కాలనీకి చెందిన 20 కుటుంబాల వారు పార్టీలో చేరారు.

**విశాఖ రజక సమాఖ్య మద్దతు..**

31వ వార్డు మండల అధ్యక్షుడు బాపూ ఆనంద్ ఆధ్వర్యంలో విశాఖ రజక సమాఖ్య అధ్యక్షుడు పి.రామారావు సమక్షంలో సుమారు 50 మంది పార్టీలో చేరారు.

**డిస్ట్రిక్ట్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ మద్దతు..**

విశాఖ డిస్ట్రిక్ట్ హ్యాండ్ బాల్ అసోసియేషన్‌కు చెందిన టింకు దుర్గా, గండిబోయిన చిన్న ఆధ్వర్యంలో 50 మంది ఫ్రూట్ మార్కెట్ వ్యాపారులు పార్టీలో చేరారు.

**మాదిగ కమ్యూనిటీ మద్దతు..**

37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ ఆధ్వర్యంలో గనగళ్ల రామరాజు, అశోక్ సమక్షంలో మాదగ కమ్యూనిటీ సభ్యులు పార్టీలో చేరారు.

**విజయదుర్గా ఆటోస్టాండ్ మద్దతు..**

32వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు బోని దేవ, సురపతి అప్పన్న ఆధ్వర్యంలో వంద మంది విజయదుర్గా ఆటో స్టాండ్ కార్మికులు పార్టీలో చేరారు.

**టీడీపీ, జనసేన నేతల చేరిక..**

34వ వార్డుకు చెందిన గరికిన కొండబాబు ఆధ్వర్యంలో వార్డుకు చెందిన 60 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు పార్టీలో చేరారు.


34వ వార్డు టీడీపీ, జనసేన కార్యకర్తలతో వాసుపల్లి గణేష్‌కుమార్

### ప్రచార పర్వం

దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఎంపీగా బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యేగా వాసుపల్లిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. జగనన్న అందజేస్తున్న అభివృద్ధి, సంక్షేమం నిరంతరంగా పేదలకు అందాలంటే మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిని చేసుకోవాలని తెలిపారు. ప్రజలు నాయకులకు బ్రహ్మరథం పట్టారు.

- డాబాగార్డెన్స్/అల్లిపురం/మహారాణిపేట


29వ వార్డులో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ కోడలు రాశి


కొబ్బరితోటలో ప్రచారం చేస్తున్న తోట పద్మావతి తదితరులు


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బోర విజయలక్ష్మి తదితరులు


39వ వార్డులో ప్రచారం చేస్తున్న కొల్లి సింహాచలం


ద్రోణంరాజు శ్రీవత్సవ్‌తో కలిసి ప్రచారం చేస్తున్న కోడూరు అప్పలరత్నం

### 'నయవంచక బీజేపీని ఓడించాలి'

డాబాగార్డెన్స్ : ఆంధ్రప్రదేశ్‌ను నమ్మించి మోసం చేసిన బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలని, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా చేపట్టిన యాత్ర సోమవారం విశాఖ చేరుకుంది. ఈ సందర్భంగా ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. దశాబ్దం నుంచి ఆంధ్రప్రదేశ్‌కి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గాలను తీవ్రంగా ఖండించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలు దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు బీజేపీతో ప్రత్యక్షంగా, పరోక్షంగా, భేషరతుగా పొత్తు పెట్టుకోవడంపై మండిపడ్డారు. విద్యార్థి నాయకుడు ప్రతిపాటి బుల్లిరాజు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. గ్రామిక వికాస సంఘటన జాతీయ ఉపాధ్యక్షుడు యజ్ఞ నారాయణ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విశాఖ కాకుండా అదానీ పట్నంగా మార్చేసే అవకాశాలున్నాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అప్పలనాయుడు, సాధన సమితి నాయకులు జీవీఎల్ఎస్ శాస్త్రి, అరవపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

### పాత్రికేయుడు అచ్చిరాజుకి ఘన నివాళి


అచ్చిరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్ తదితరులు

డాబాగార్డెన్స్ : పాత్రికేయుడు ఎం. అచ్చిరాజు వర్ధంతి సోమవారం స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ పరిశీలకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పలువురు సభ్యులు, పాత్రికేయులు పాల్గొని అచ్చిరాజు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆశ్రమంలో గల వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. సంస్థ ట్యూషన్ పిల్లలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవత్సవ్ మాట్లాడుతూ అచ్చిరాజు నైతిక విలువలు గల వ్యక్తి అన్నారు. అచ్చిరాజు కుటుంబ సభ్యులు, స్వామి వివేకానంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

### సముద్రాలపై అవగాహన అవసరం

ఏయూ క్యాంపస్: సముద్రాలపై అవగాహన కల్పించడం, వాటి సంరక్షణ దిశగా ప్రజలను నడిపించడం ఎంతో అవసరమని గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ఆచార్య కె.ఎస్.కృష్ణ అన్నారు. బీచ్ రోడ్డులోని ఐసీఏఆర్-సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీష్ టెక్నాలజీ 67వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సముద్ర జీవావరణంపై ప్రజల్లో చైతన్యం పెంచాలని, వాటి ప్రాముఖ్యతను తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖపట్నం ఐసీఏఆర్-సీఐఎఫ్‌టీ సైంటిస్ట్ ఇన్‌చార్జి డాక్టర్ యు.శ్రీధర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో తమ సంస్థ సాధిస్తున్న ప్రగతిని, విశేషాలను వివరించారు.